క్లుప్తంగా

టీఎంహెచ్‌డీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నరేందర్



చెన్నారావుపేట : తెలంగాణ మాదిగ హక్కుల దండోరా (టీఎంహెచ్‌డీ) జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని ఉప్పరపల్లికి చెందిన బొమ్మెర నరేందర్ నియమితులయ్యాడు. ఈ మేరకు నరేందర్‌కు దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొట్టె పద్మయ్య ఆధ్వర్యంలో వ్యవస్థాపక అధ్యక్షుడు జన్ను కనకరాజు గురువారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరేందర్ మీడియాతో మాట్లాడారు. మాదిగ జాతి ఐక్యతకు, బలోపేతానికి పాటుపడతానని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొట్టె శ్రవణ్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు దుపాకి నరేందర్, కాయిత ప్రసాద్, ఉపాధ్యక్షుడు ఇల్లందుల సమ్మయ్య, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గన్నారపు సంగీత్, జనరల్ సెక్రటరీ దేవరకొండ శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. కూలీలకు గాయాలు



వర్ధన్నపేట : ఆటో బోల్తా పడి అందులో ప్రయాణిస్తున్న వ్యవసాయ కూలీలకు గాయాలైన ఘటన మండలంలోని కడారిగూడెంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని తాళ్లకుంట తండాకు చెందిన వ్యవసాయ కూలీలు కడారిగూడెంలో పనులకు ఆటోలో గురువారం ఉదయం బయలుదేరారు. ఆటో కడారిగూడెం శివారులోని మూలమలుపు వద్ద ప్రమాదవశాత్తు అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న కూలీలు వాంకుడోతు కమలమ్మ, బానోతు సరోజన, వాంకుడోతు అమ్మి తీవ్ర గాయాల పాలయ్యారు. మరో 8 మంది కూలీలకు, ఆటో డ్రైవర్ వాంకుడోతు కిషన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్ర గాయాలైన ముగ్గురు మహిళా కూలీలను ఆస్పత్రిలో చేర్చుకుని చికిత్స అందిస్తున్నారు. మిగతా వారికి ప్రథమ చికిత్స చేసి పంపించారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి



సంగెం : ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని మొండ్రాయికి చెందిన లక్క బక్కయ్య (65) ఈనెల 17న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబీకులు గమనించి వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ఎల్.నరేశ్ తెలిపారు.

మద్యం, టవేరా వాహనం స్వాధీనం



వర్ధన్నపేట : ప్రభుత్వ అనుమతి లేకుండా మద్యం సరఫరా చేస్తున్న టవేరా వాహనాన్ని స్వాధీనం చేసుకుని ఒకరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పోలీసు సిబ్బంది సురేశ్, దామోదర్ ఇల్లంద శివారులో కట్ర్యాల దిశగా వెళ్తున్న టవేరా వాహనాన్ని అనుమానించి అడ్డుకుని తనిఖీ చేశారు. వాహనంలో 96 కింగ్ ఫిషర్ బీర్లు ఉండడాన్ని గుర్తించి మద్యంతోపాటు వాహనాన్ని అదుపులోకి తీసుకుని వాహన యజమాని అయిన పర్వతగిరి మండలంలోని గోపనపెల్లికి చెందిన బోయిని దామోదర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

దాబాలో..



పర్వతగిరి : మండలంలోని కొంకపాక క్రాస్ రోడ్ సమీపంలోని సాయి దాబాలో అక్రమంగా నిల్వ చేసిన రూ.3 వేల 300 విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై జి.వెంకన్న తెలిపారు. మూడెత్తులతండాకు చెందిన దాబా నిర్వాహకుడు మూడు రమేశ్ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు గురువారం తనిఖీ చేసినట్టు తెలిపారు. రమేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

కోల్ యాష్ లారీలతో ఇబ్బందులు

- ఇల్లంద గ్రామస్తుల ధర్నా, రాస్తారోకో



ఇల్లంద ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

వర్ధన్నపేట : కోల్ యాష్ లారీలతో ఇబ్బందులు పడుతున్నామంటూ మండలంలోని ఇల్లంద గ్రామస్తులు గ్రామంలోని వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై గురువారం ధర్నా, రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. ఈ క్రమంలో ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. లారీలు తగు జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చి ఆందోళన విరమింపజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సమస్యను మీడియాకు వివరించారు. సిమెంట్ కంపెనీలకు కోల్ యాష్ తరలిస్తున్న లారీలు గ్రామంలోని జాతీయ రహదారి మీదుగా ప్రయాణిస్తున్న క్రమంలో రోడ్డుకు ఇరువైపులా వందల మీటర్ల మేర బూడిద కమ్ముకుంటూ తమను రోగాల పాల్జేస్తోందని తెలిపారు. లారీల నుంచి బూడిద బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవడం లేదని చెప్పారు. లారీ రవాణాలో ఓనర్లు, డ్రైవర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో బూడిద బయటకు వచ్చి తాము ఊపిరితిత్తుల, ఇతర పలు రకాల అనారోగ్య సమస్యలతో ఆస్పత్రుల పాలవుతున్నామని వాపోయారు. ఇకనైనా ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారులు కోల్ యాష్ తరలించే లారీలు తగు జాగ్రత్తలు తీసుకునేలా చూడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మరింత పెద్దఎత్తున ఆందోళనలు తప్పవని స్పష్టం చేశారు.

లారీల్లో పోలీసుల తనిఖీ.. జరిమానా

మండలంలోని ఇల్లంద గ్రామం మీదుగా ప్రయాణిస్తున్న 10 కోల్ యాష్ లారీలను ఎస్సై ప్రవీణ్‌కుమార్ తనిఖీ చేశారు. అధిక లోడ్ తీసుకెళ్లడంతోపాటు జాగ్రత్తలు పాటించడం లేదని గుర్తించి జరిమానా విధించారు. లారీ డ్రైవర్లకు, రవాణాదారులకు కౌన్సెలింగ్ చేశారు. జాగ్రత్తలు తీసుకోకుండా కోల్ యాష్ రవాణా చేస్తుండడంతో ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉంటుందని చెప్పారు. కోల్ యాష్ రవాణా సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.



లారీ డ్రైవర్‌తో మాట్లాడుతున్న ఎస్సై

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ గోపాల్, తదితరులు

నర్సంపేట రూరల్ : దాసరి రాజిరెడ్డి (డీఆర్‌ఆర్) ఎడ్యుకేషన్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సామాజిక సేవలు నిర్వహించడం అభినందనీయమని నర్సంపేటలోని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపాల్, ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రసన్నలక్ష్మి తెలిపారు. నర్సంపేట మండలంలోని దాసరిపల్లికి చెందిన దాసరి సాంబరెడ్డి స్మారకంగా ఆ ట్రస్ట్ ఆధ్వర్యంలో నర్సంపేటలోని ఆరు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను గురువారం డాక్టర్ గోపాల్, ప్రసన్నలక్ష్మి ప్రారంభించి మాట్లాడారు. వేసవి నేపథ్యంలో పాదచారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేలా పట్టణంలోని ముఖ్యమైన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ట్రస్ట్ ప్రతినిధి మేకల రాజేందర్ మాట్లాడారు. పట్టణంలోని జిల్లా ఆస్పత్రి ఆవరణలో, నర్సంపేట ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో, మాదన్నపేట ఆటో స్టాండ్ వద్ద, వ్యవసాయ మార్కెట్ వద్ద, అంగన్ సెంటర్, పాకాల్ సెంటర్ వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రయాణికులు, పాదచారులు చలివేంద్రాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమాల్లో జిల్లా ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ మనోజ్‌లాల్, ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ భవాని, ఆర్టీసీ సిబ్బంది సాంబయ్య, వెంకటేశ్వర్లు, చారిటబుల్ ట్రస్ట్ సిబ్బంది పస్తం రాము, తెప్ప రమేశ్, మేకల మహేశ్, కట్ల శ్యామ్, పొన్నం రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళాల వెల్లువ



సంగెం : మండలంలోని గవిచర్లలోని గుండ బ్రహ్మయ్య ఆలయ పునర్నిర్మాణానికి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. ఎంపీటీసీ గూడ సంపత్‌రెడ్డి దంపతులు గురువారం రూ.10 వేల 116 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కొంతం యాదగిరి మాట్లాడారు. దేవాదాయ శాఖకు డిపాజిట్ చేసేందుకు విరాళాలు సేకరించాలని కమిటీ నిర్ణయించిందని చెప్పారు. తాను రూ 50 వేల 116, ఎంపీటీసీ సంపత్‌రెడ్డి రూ.10 వేల 116, మందపురి బలరాం 2 వేల 516, ఇస్మాయిల్ రూ.2 వేల 116 అందించినట్లు తెలిపారు. భక్తులు విరాళాలు అందించాలని కోరారు.

హిందూ ధర్మాన్ని పరిరక్షించాలి



ఆలయంలో పూజ చేస్తున్న హనుమాన్ భక్తులు



భక్తులకు మాలధారణ చేస్తున్న స్వామీజీ

నర్సంపేట : సమాజంలోని ప్రతీఒక్కరు హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలని అఖిల భారత పీఠాధిపతి శ్రీశ్రీ దుర్గాప్రసాద్ స్వామిజీ కోరారు. పట్టణంలోని శ్రీశ్రీధర్మశాస్త్రా అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో ఆలయ కమిటీ సేవా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ గుప్తా ఆధ్వర్యంలో గురువారం మాలధారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ స్వామిజీ పాల్గొని 68 మంది భక్తులకు ఆంజనేయ స్వామి మాలవేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మాదారపు చంద్రశేఖర్‌గుప్తా, దొడ్డ రవీందర్, భూపతి లక్ష్మీనారాయణ, శింగిరికొండ వేణుగోపాల్, బండారుపల్లి చెందారావు, ఆకుల ప్రభాకర్, మల్యాల రాజు, అర్చకుడు దేవీశ్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో అగ్నిప్రమాదాల నివారణ



గీసుకొండ : కరపత్రాలు, పోస్టర్లను ప్రదర్శిస్తున్న అధికారులు, సిబ్బంది

రాయపర్తి : అవగాహన పెంచుకోవడం ద్వారా అగ్నిప్రమాదాలు నివారించొచ్చని అగ్నిమాపక శాఖ అధికారి వి.భద్రయ్య తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయంలో గ్యాస్ డెలివరీ బాయ్‌లకు గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అగ్నిప్రమాదాల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించిన సమాచార కరపత్రాలను సిబ్బందికి అందజేశారు.

కీర్తినగర్ కాలనీలో..

గీసుకొండ : మండలంలోని కీర్తినగర్ కాలనీలో వరంగల్‌కు చెందిన జయ ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ఫైర్ అధికారులు, సిబ్బంది అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదం సంభవిస్తే, సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను కరపత్రాలతో వివరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఓ ఐసీ బి.రవీందర్, ఎల్ఎఫ్ ఎం.గణేశ్, డీఓపీ టి.గంగాధర్, ఎఫ్ఎం నబి, హెచ్‌జీలు కె.రవి, బి.గిరిబాబు పాల్గొన్నారు.



రాయపర్తి : మాట్లాడుతున్న అధికారి భద్రయ్య

ముస్లింల సంక్షేమానికి ప్రాధాన్యం

రాయపర్తి : కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తోందని తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్ తెలిపారు. మండల కేంద్రంలోని మస్జిద్–ఏ–నూర్‌లో ఆ మత పెద్దలు గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి ముస్లింలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా చొరవ తీసుకుంటున్నారని తెలిపారు. ముస్లింల సమస్యలను, అభివృద్ధి దిశగా చేపట్టాల్సిన కార్యక్రమాలను పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా పాటుపడతానని చెప్పారు. కార్యక్రమంలో సదర్ హుస్సేన్, ఇమామ్ షేక్ ఇర్ఫాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెండ్లి మహేందర్‌రెడ్డి,, ఎనగందుల మురళి, యాకూబ్, రమేశ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హామ్యానాయక్

కేన్సర్ రోగికి సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న వెంకటరమణ

వర్ధన్నపేట : మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన పోశాల నళిని సురేశ్ కేన్సర్‌తో బాధపడుతుండగా వైద్యం కోసం ఆమెకు వీఏకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి వన్నాల వెంకటరమణ గురువారం రూ.20 వేల సాయం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడారు. ఫౌండేషన్ ద్వారా 15 ఏళ్లుగాసామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రాయపురం కుమారస్వామి, తక్కళ్లపెల్లి శ్రీదేవి, కత్తి రాజు, నాంపెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ బోధన

రాయపర్తి : ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ విద్యాబోధన లభిసుత్తుందని ఎంఈఓ నోముల రంగయ్య స్పష్టం చేశారు. మండలంలోని కొత్తూరు గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో ప్రభుత్వ పాఠశాలల విద్యకు సంబంధించిన కరపత్రాలను ఉపాధ్యాయులతో కలిసి గురువారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వం ఒక్కో విద్యార్థిపై ఏటా రూ.40 వేలు ఖర్చు చేస్తోందని చెప్పారు. ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించిందని తెలిపారు. ఈ ఏడాది నుంచి డిజిటల్ విద్యాబోధన, ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభించనున్నట్టు చెప్పారు. ప్రభుత్వం గతేడాది నుంచి విద్యార్థులకు రాగిజావ, అల్పాహార పథకాన్ని అమలు చేస్తోందని వివరించారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సింగరాచారి, మోహన్‌రావు, శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రావు, స్వాతి, సురేఖ, రమాదేవి, అనురాధ, పూర్ణచందర్‌రావు, హన్మంతరావు, స్వర్ణలత, సుజాత, సబియా బాను, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.



రాయపర్తి : కరపత్రాలతో ఎంఈఓ రంగయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా..

నల్లబెల్లి : ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లలోనే మెరుగైన విద్యాబోధన అందుతోందని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ లక్ష్మి, నారక్కపేటలోని ప్రభుత్వ హైస్కూల్ హెచ్ఎం ఎల్.సుధాకర్ తెలిపారు. మండలంలోని నారక్కపేటలోని స్కూల్‌లో పాఖాల, ఓరుగల్లు గ్రామైఖ్య సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులు బోధిస్తున్నారని తెలిపారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి రహీం, ఉపాధ్యాయులు శ్రీనివాస్, అశోక్, వాల్యా, రామ్ మనోహర్, ఆశ వర్కర్ సుల్తానా, జ్యోతి, రాజు, హేమలత, గ్రామైఖ్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



నల్లబెల్లి : మాట్లాడుతున్న హెచ్ఎం సుధాకర్

‘ప్రజాధనాన్ని దోచుకున్నది బీఆర్‌ఎస్ నాయకులే’

ఖానాపురం : ప్రజాధనాన్ని దోచుకున్నది బీఆర్‌ఎస్ నాయకులేనని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్‌మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు ధ్వజమెత్తారు. సొసైటీ చైర్మన్ అవినీతికి పాల్పడకుంటే డైరెక్టర్లను గోవా టూర్‌కు ఎందుకు తీసుకెళ్లారని వారు ప్రశ్నించారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సర్పంచ్‌ల వద్ద కమీషన్లు దండుకున్నాడని ధ్వజమెత్తారు. స్వార్థం కోసం సొంత పార్టీ నాయకులను ఓడించలేదా? అని ప్రశ్నించారు. ఎంపీటీసీగా ఎలా గెలిచాడో గుర్తు చేసుకోవాలని హితవు పలికారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత రోడ్ల అభివృద్ధి పనులు పూర్తి చేయిస్తామని చెప్పారు. బహిరంగ సభ నేపథ్యంలో బహిరంగ చర్చకు మరో తేదీ ప్రకటించాలన్నారు. మహబూబాబాద్‌లో జరిగే జనజాతర సభను జయప్రదం చేయాలని శ్రేణులను కోరారు. సమావేశంలో నాయకులు బిక్కి మురళి, విద్యాసాగర్‌రావు, ఎంపీటీసీ విజాకర్‌రావు, ముస్తఫా, వేణుగోపాల్, మధు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రెడ్డి

విద్యాశాఖ అనాలోచిత నిర్ణయం

- తప్పుల తడకగా ఎస్ఏ–2 పరీక్షల టైంటేబుల్
- తొమ్మిదో తరగతి బయాలాజికల్ పరీక్ష ఉదయం 10:45 నుంచి మధ్యాహ్నం 12:15 గంటల వరకు
- ఎనిమిదో తరగతి బయాలాజికల్ పరీక్ష మధ్యాహ్నం 12:30 నుంచి 3:15 గంటల వరకు
- మండుటెండలో పరీక్ష ఎలా రాయాలని ఎనిమిదో తరగతి విద్యార్థుల ఆందోళన
- టైంటేబుల్‌ను సవరించాలని విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాల డిమాండ్



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

నల్లబెల్లి : విద్యాశాఖ అధికారుల అనాలోచిత నిర్ణయాలతో ఎస్ఏ–2 పరీక్షల టైంటేబుల్‌లో తప్పులు దొర్లాయి. 8వ తరగతి బయోలాజికల్ సైన్స్ పరీక్ష ఈనెల 20న మధ్యాహ్నం 12:30 నుంచి 3:15 గంటల వరకు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. ఎండలు మండుతుండడంతో పరీక్ష ఎలా రాయాలని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఒకటి నుంచి 9వ తరగతి విద్యార్థుల వార్షిక పరీక్షలకు (ఎస్ఏ–2) సంబంధించిన టైంటేబుల్‌ను రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి డైరెక్టర్ రూపొందించారు. అన్ని సబ్జెక్టులకు ఒకే పేపర్‌తో పరీక్షలు నిర్వహిస్తుండగా.. 8, 9 తరగతుల ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ పరీక్షలను వేర్వేరు సమయాల్లో నిర్వహించాలి. 9వ తరగతి విద్యార్థులకు ఫిజికల్ సైన్స్ పరీక్ష ఉదయం 9 నుంచి 10:30 గంటల వరకు, బయోలాజికల్ సైన్స్ పరీక్ష ఉదయం 10:45 నుంచి మధ్యాహ్నం 12:15 గంటల వరకు నిర్వహించాలని ఆదేశాలు జారీచేశారు. కానీ , 8వ తరగతి ఫిజికల్ సైన్స్ పరీక్ష ఉదయం 9నుంచి 11:45 గంటల వరకు, బయోలాజికల్ సైన్స్ పరీక్ష మధ్యాహ్నం 12:30 నుంచి 3:15 గంటల వరకు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. 9వ తరగతి కంటే 8వ తరగతి విద్యార్థులకు పరీక్ష సమయం ఎందుకు ఎక్కువగా నిర్ణయించారని, పొరపాటు జరిగి ఉంటే ఎందుకు సరిచేయడం లేదని విద్యావేత్తలు, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. మండుటెండలో మధ్యాహ్నం 3:15 గంటల వరకు పరీక్షలు ఎలా నిర్వహిస్తారో విద్యాశాఖ అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నిర్ణయంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే పరీక్షల సమయాన్ని సరిచేయాలని కోరుతున్నారు.

విద్యార్థులు అస్వస్థతకు గురవుతారు..



ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. మధ్యాహ్నం 3.15 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తే విద్యార్థులు వడదెబ్బతో అస్వస్థతకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది. 9వ తరగతి విద్యార్థులకు ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ పరీక్షలు గంటన్నర చొప్పున నిర్వహించేందుకు సమయం నిర్ణయించి, 8వ తరగతి విద్యార్థులకు 2.45 గంటల సమయం నిర్ణయించడం సరికాదు. విద్యాశాఖ అధికారులు పునరాలోచన చేయాలి.

– బొట్ల నరేష్, ఏబీవీఎస్ఎఫ్, జిల్లా కార్యదర్శి

టైంటేబుల్ ఉన్నతాధికారులు నిర్ణయించారు



1వ నుంచి 9వ తరగతి ఎస్ఏ–2 పరీక్షల టైంటేబుల్‌ను రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు నిర్ణయించారు. వారి ఆదేశాల మేరకే జిల్లాలో పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశాం. విద్యార్థులు వడదెబ్బకు గురికాకుండా అవసరమైన ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

– వాసంతి, డీఈఓ

కార్యకర్తలకు అండగా ఉంటా

ఆత్మకూరు : కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నీరుకుళ్లకు చెందిన అర్షం రాజేందర్, మేడ రామస్వామితోపాటు పలువురు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో గురువారం చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమన్నారు. కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి కాంగ్రెస్ అభ్యర్థి భారీ మెజారిటీతో గెలుపొందేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నీరుకుళ్ల గ్రామకమిటీ అధ్యక్షుడు కిన్నెర ప్రేమ్‌చంద్, నాయకులు రాజు, కుమార్ పాల్గొన్నారు.